ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరం

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. సోమవారం 4వ డివిజన్‌లోని హైదర్షాకోట్, 15వ డివిజన్‌లోని శాంత దినగర్ కాలనీ, 16వ డివిజన్‌లోని రఘురాంనగర్ కాలనీలలో సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి పూర్తి వివరాలను నమోదు చేసుకొని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ వెంకటప్ప, బిల్ కలెక్టర్ నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు



దర్గాఖలీజ్‌ఖాన్‌లో డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి అలసత్వం లేకుండా పరిసరాలను శుభ్రం చేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం 10వ డివిజన్‌లోని అభ్యుదయ నగర్, 12వ డివిజన్‌లోని హిమాయత్‌సాగర్‌లలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం 11వ డివిజన్‌లోని దర్గా ఖలీజ్‌ఖాన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు జగన్, యాదగిరి, టౌఫిక్, రాము తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

శంషాబాద్: పట్టణంలోని తొండుపల్లి ఎం.పి.ఎస్ క్రీడా మైదానంలో తెలంగాణ జూనియర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో ఆదిలాబాద్, ఆర్మూర్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నిర్మల్, నాందేడ్ జిల్లాలకు చెందిన మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయి. క్రికెట్ పోటీలను స్థానిక కౌన్సిలర్ పారెపల్లి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. వీఎన్ డెవలపర్స్ వేణుమాధవ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పరమేష్ గౌడ్, ప్రవీణ్‌గౌడ్, బంగారం కుమార్, కొండ ప్రవీణ్‌గౌడ్, పున్నారెడ్డి, డొకావత్, సురేందర్‌ల సహకారంతో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో దొడ్డ పెంటయ్య, దర్శన్, అశోక్, విశ్వనాథం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేతలకు అభినందనల వెల్లువ



శంషాబాద్: ఇటీవల జరిగిన తంగిల్ కరాటే పదో జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆర్‌బీనగర్ మైదానంలో అభినందలు వెల్లువెత్తాయి. బీఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ భగవాన్‌దాస్ నాయక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విజేతలను సోమవారం రాత్రి ఆర్‌బీనగర్ మైదానంలో స్థానిక కౌన్సిలర్లు పుష్పలత బుచ్చిరెడ్డి, కొనమొల్ల భారతమ్మ తదితరులు ఘనంగా సన్మానించారు. కాలనీ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొనమొల్ల శ్రీనివాస్, స్థానికులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్,సురేష్, పాండురంగారెడ్డి, విజయ్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం



అంశాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని సోమవారం రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. జెడ్పీహెచ్ఎస్ ప్రాంగణంలో గణిత శాస్త్ర మోడల్స్‌ను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎస్‌కేతాజ్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఒక వైజ్ఞానిక ప్రదర్శన తరహాలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు పలు రకాల మోడల్స్ తయారు చేసి తమ సత్తాను చాటారన్నారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణవేణి, లక్ష్మణ్, ప్రజ్ఞచైతన్య, శాంత, మమత, క్రాంతి, శ్రీలత, మహిపాల్ పర్యవేక్షణలో కార్యక్రమం సాగింది.

బండ్లగూడ జాగీర్ పరిధిలో... అప్పుడే నీటి కష్టాలు!

- రూ. 6.50 కోట్ల వ్యయంతో పథకం
- అయినా వేసవిలో నీరు అందేనా అనే అనుమానాలు



నీటి శుద్ధి కోసం తెచ్చిన ఫిల్టర్ బెడ్‌లు

బండ్లగూడ: రానున్న వేసవిలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనా ప్రజలకు తాగునీటి కష్టాలు తీవ్రం అయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి. తాగునీటి కోసమే కాకుండా ఇతర అవసరాల కోసం వాడుకునే నీటికీ అప్పుడే కొరత ఏర్పడింది. వేసవి ప్రారంభం కాలేదు.. ఎండల తీవ్రతా లేదు.. అప్పుడే నీటి కష్టాలు అధికం అవుతున్నాయి. డిసెంబర్‌లోనే నీటి కష్టాలు ప్రారంభం కావడంతో స్థానికుల్లో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఫిర్యాదు చేసినా స్పందన నిల్...

కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలలో వారంలో ఒక రోజు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. అది కూడా రాత్రి సమయంలో వదులుతున్నారు. జలమండలిలో పనిచేసే కొందరు లైన్ మెన్‌లకు బోర్లు పని చేయని కాలనీలవారు ముడుపులు చెల్లించుకుంటే చాలు ఎక్కువ సమయం నల్లాల్లో నీటిని వదులుతున్నారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులకు పలు మార్లు ఫిర్యాదులు చేస్తున్నా పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలూ లేకపోలేదు. ఇప్పుడే ఇలా ఉంటే ఇక వేసవిలో నీటి ఎద్దడిని ఎలా ఎదుర్కోవాలనే ఆందోళన బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజానీకంలో వ్యక్తం అవుతోంది.

హిమాయత్‌సాగర్ నుంచి కార్పొరేషన్‌కు నీరు



ఇంటి ఆవరణలో బోరు వేస్తున్న దృశ్యం

ఇంటి ఆవరణల్లోనే మళ్లీ బోర్లు...

- ఈ సారి చలికాలంలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా కార్పొరేషన్ పరిధిలో నీటి తిప్పలు నెలకొన్నాయి. ఇప్పటికే పలు కాలనీలలో ఇండ్లలోని బోర్లలో నీరు ఇంకిపోవడంతో ట్యాంకర్ నీటిని కొనుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గత సంవత్సరంలోనే చాలా మంది ఇండ్లలోని బోరు బావుల్లో నీరు లేకపోవడంతో మళ్లీ ఆయా ఇంటి ఆవరణల్లోనే బోర్లు వేయించుకుంటున్నారు. ప్రస్తుతం కూడా కొన్ని కాలనీలో ఇదే తంతు జరుగుతున్నది.
- కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న నీటి సమస్యను తీర్చేందుకు హిమాయత్‌సాగర్ నీటిని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు అందించేందుకు మేయర్ లతాప్రేమ్‌గౌడ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సహకారంలో తగు చర్యలు తీసుకుంటున్నారు. అందులోభాగంగా రూ. 6.50 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు మొదలు పెట్టారు. రూ. 2 కోట్లతో ఫిల్టర్ బెడ్, రూ. 4.50 కోట్లతో పైప్‌లైన్ కోసం కేటాయించారు.



ట్యాంకర్ ద్వారా నీరు పట్టుకుంటున్న దృశ్యం

త్వరలో హిమాయత్‌సాగర్ నీరు



కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న నీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని హిమాయత్‌సాగర్ నీటిని బండ్లగూడ జాగీర్ ప్రజలకు ఈ వేసవిలో అందేలా చర్యలు తీసుకుంటాం. నీటి శుద్ధి కోసం రూ. 2 కోట్ల వ్యయంతో ఫిల్టర్ బెడ్‌లు తెప్పించాం. అందుకు సంబంధించిన పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రజలకు ఎలాంటి నీటి కష్టాలు ఎదురవకుండా చూసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం.

– లతాప్రేమ్‌గౌడ్, మేయర్ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్

అమర్‌రాజా బ్యాటరీ పరిశ్రమలో అగ్నిప్రమాదం

- వెల్డింగ్ చేస్తుండగా అంటుకున్న మంటలు
- ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది



పరిశ్రమలో చెలరేగుతున్న మంటలు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయ సమీపంలో నిర్మాణంలో ఉన్న అమర్‌రాజా బాటరీ పరిశ్రమలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నోవాటెల్ సమీపంలో కొత్తగా నిర్మాణం చేపడుతున్న అమర్‌రాజా బ్యాటరీ పరిశ్రమలోని ఐదో అంతస్తులో జరుగుతున్న పీవీసీ షెడ్డులో సాయంత్రం 5.30 గంటల సమయంలో కార్మికులు వెల్డింగ్ పనులు చేస్తుండగా దాని నుంచి వచ్చిన నిప్పు రవ్వలు పడి కింది భాగంలో ఉన్న ప్లైవుడ్ షీట్స్‌కు అంటుకున్నాయి. పై అంతస్థులో నుంచి కింది వరకు ఉన్న షీట్స్‌కు కూడా మంటలు అంటుకోవడంతో భారీ ఎత్తున ప్లైవుడ్ షీట్స్ దగ్ధమయ్యాయి. దీంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు బయటకు పరుగులు పెట్టారు. ఎయిర్‌పోర్టులోని ఫైరింజన్‌తో పాటు బయటి నుంచి అగ్నిమాపక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని గంటలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి ప్రాణాపాయం చోటు చేసుకోలేదు. ఈ మేరకు ఆర్‌జీఐ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారతీయ సంస్కృతిపై యువతకు అవగాహన అవసరం



హిమాచల్ ప్రదేశ్ పర్యటను వెళ్లిన విద్యార్థుల బృందం

రాయదుర్గం: భారతీయ సంస్కృతి, చరిత్ర, విజయాలపై యువతకు అవగాహన అవసరమని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీఎమ్ రహమాన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల తెలంగాణ వ్యాప్తంగా 50 మంది విద్యార్థుల బృందం హిమాచల్ ప్రదేశ్‌లోని ఎన్ఐటీ హమీర్‌పూర్‌కు పరివర్తన యాత్రలో పాల్గొన్నారు. సోమవారం వారిని ఉద్దేశించి ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ మాట్లాడుతూ.. భారతదేశంలోని విభిన్న ప్రాంతాల మధ్య ఐక్యత, అవగాహనను పెంపొందించే లక్ష్యంతో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ (ఈబీఎస్‌బీ) గొడుగు కింద ప్లాగ్‌షిప్ ఇనిషియేటివ్ యువసంఘం కార్యక్రమంలో భాగంగా నిర్వహించారని గుర్తు చేశారు. 'మనూ'మాస్ కమ్యూనికేషన్స్ డీన్, నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ మహ్మద ఫరియాద్ మాట్లాడుతూ.. యువ సంఘం కేవలం సందర్శన పర్యటన మాత్రమే కాదని, ఇది స్వీయ ఆవిష్కరణ, క్రాస్ కల్చరల్ లెర్నింగ్ యొక్క రూపాంతర ప్రయాణమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

రాజేంద్రనగర్: అక్రమ నిర్మాణాలతో పాటు అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలని సోమవారం పలువురు పోలీసులతో పాటు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉప్పర్‌పల్లి ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి భారీ షెడ్‌ను నిర్మిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సామ ఇంద్రపాల్ రెడ్డి రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. 25 ఫీట్ల ప్రభుత్వ రోడ్డును అక్రమించి అనుమతులు లేకుండా షెడ్ నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే నివాసిత ప్రాంతాల్లో నిర్మిస్తున్న నిర్మాణాన్ని అడ్డుకొని షెడ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వైన్ షాపులతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఖాళీ స్థలాల్లో అక్రమ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారని సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు కురుమయ్య, రుద్ర కుమార్‌లు రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. వైన్ షాపుల వద్ద నడిచేందుకు సైతం స్థలం లేకుండా పార్కింగ్ చేస్తున్నారన్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పేద విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించాలి



రాయదుర్గం: పేద విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేయాలని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గం, ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులకు సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్‌కేవై ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ఆల్‌ఇన్‌వన్ స్టడీ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి పదవ తరగతి అత్యంత కీలకమన్నారు. పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు కలిపి ఆల్‌ఇన్‌వన్‌గా, మోడల్ ప్రశ్న పత్రాలు సంబంధించిన బుక్‌లెట్ అందించడం అభినందనీయమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, రాయదుర్గం, ఖాజాగూడ హెచ్ఎంలు ఎస్‌కే తాజ్‌బాబు, రాజశేఖర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నేడు టీఎన్‌జీఓ కాలనీలో కవులు, కళాకారులకు సత్కారం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓకాలనీలో తెలంగాణ ప్రభుత్వ మహిళా పెన్షనర్ల ఫోరమ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన కవులు, రచయితలను మంగళవారం సత్కరించనున్నట్లు నిర్వాహకులు ఉమాదేవి, ఎస్ఎంఎల్ నాగమాంబ, ధనలక్ష్మి వివరించారు. ఉదయం 11 గంటలకు కాలనీలో పెద్ద ఆలయం సమీపంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరామ్, రచయిత, కవు లు, అందెశ్రీ, పాశం యాదగిరి, జయరాజ్, అశోక్‌తేజ, ఎక్కా యాదగిరి, విమల, వెన్నెల వంటి వారి ని సత్కరించడం జరుగుతుందని వారు తెలిపారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని రాఫా నేచర్ క్యూర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శివరాంపల్లిలోని వయోవృద్ధుల ఆశ్రమంలో సోమవారం టవల్స్, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఆస్పత్రి ఎండీ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.



అక్రమ నిర్మాణాలను అరికట్టాలని వినతి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: లే అవుట్‌లో చూపిన రోడ్డును అక్రమించి చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని దానిని పరిరక్షించాలని, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పార్కును అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మారుతినగర్ కాలనీ పక్కనే ఉన్న పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాల ప్రహరీకి ఆనుకుని రోడ్డు ఉండగా దాన్ని పక్క ప్లాటు వారు పూర్తిగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని పలు రోడ్లు ఆక్రమణలకు గురికావటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ఆక్రమణలను తొలగించాలని కోరారు. అదే కాలనీలో పార్కుకు 1100 గజాల స్థలం వదలగా అందులో ప్రస్తుతం 600 గజాలు మాత్రమే మిగిలిందన్నారు. దాన్ని సకాలంలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా స్పందించి మారుతినగర్ కాలనీ సమస్యలు తీర్చాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారం, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ధన్‌రాజ్, నాయకులు మాల్యాద్రినాయుడు, లక్ష్మయ్య, రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ కబడ్డీ టోర్నీలో సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న రాజేంద్రనగర్ ఎంఈఓ శంకర్‌రాథోడ్

అత్తాపూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఉత్తమ శిక్షణ తీసుకొని రాణించాలని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ అన్నారు. సీఎం కప్ రంగారెడ్డి జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో రాజేంద్రనగర్ మండలం టీమ్ తృతీయ బహుమతి కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను సోమవారం అభినందించారు. అలాగే మహారాష్ట్రలో అమరావతి పేరుతో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఎస్‌జీఎఫ్‌లో శివరాంపల్లి పాఠశాల విద్యార్థిని సబా అన్సారి పాల్గొని విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ... విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల మరింత నైపుణ్యవంతులుగా ఎదుగుతారన్నారు. అలాగే రవి బ్రిలియంట్ పాఠశాల నుంచి సీఎం కప్ జిల్లా జట్టుకు కిమ్‌కళ, కబడ్డీ, ఖోఖోలో చంద్రకళలు ఎంపికయ్యారని పాఠశాల జోనల్ ఇన్‌చార్జి కె.గాంగ్యనాయక్ తెలిపారు. కార్యక్రమంలో శివరాంపల్లి హెచ్ఎం కిషన్, సుదర్శన్, వెంకటయ్య పాల్గొన్నారు.

ముగిసిన ఇంధన సంరక్షణ వారోత్సవాలు



వారోత్సవాల్లో పాల్గొన్న అధ్యాపకులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో వారం రోజులుగా కొనసాగిన ఇంధన సంరక్షణ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. విద్యార్థి వ్యవహారాలు, ప్రగత విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.లింగారెడ్డి పాల్గొని ఇంధన పొదుపు అవసరం, విశిష్టతను వివరించారు. స్థిరమైన భవిష్యత్తును నిర్ధారించటానికి, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించటం, ఆర్థిక స్థిరత్వాన్ని ప్రోత్సహించడానికి శక్తి పొదుపు ఎంతో అవసర మన్నారు. ప్రొఫెసర్ జి.సురేష్‌బాబు ఇంధన పొదుపు గణాంకాలను వివరించారు. ఇంధన పొదుపులో పాల్గొంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎనర్జీ క్విజ్, ఎనర్జీ స్లోగన్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అందులో కేతావత్ హన్మంతు, కె.వెంకటసాయేష్‌రెడ్డి, ఎం.డి.దండె మేధాశ్రీ, తేజావత్ మానస, ఎం.డి. సుమన్, గౌరీ, ప్రీతంలు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి బాల సుబ్బారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్‌లో సమస్యలు పరిష్కరించాలని వినతి

రాజేంద్రనగర్: ఆరాంఘర్ చౌరస్తాలోని సీఐటీయూ ఆటో స్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జాజాల రుద్ర కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ రాజేంద్రనగర్ మండలం ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి కాలే రాజు అధ్యక్షతన రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం బస్ స్టాండ్ రోడ్డులో చాలా సంవత్సరాలుగా ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. 50 మంది ఆటో కార్మికులు ఈ మధ్య కాలంలో ఆరాంఘర్ చౌరస్తాలో పబ్లిక్ రద్దీ పెరగడంతో ఆటోలు నిలపడానికి ఇబ్బందికరంగా ఉందన్నారు. చౌరస్తాలో పిల్లర్ నంబర్ 319–320 మధ్యలో ఖాళీ స్థలం ఉందని.. అక్కడ వివిధ ప్రాంతాలకు సంబంధించిన ద్విచక్ర వాహనాలు అక్కడ పెట్టి పార్కు చేసి వెళ్లిపోతున్నారన్నారు. కొంతమంది ఏకంగా వారం రోజులు కూడా పార్క్ చేస్తున్నారన్నారు. ఆటో కార్మికుల పార్కింగ్ సమస్య పరిష్కారం కావాలంటే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చొరవ చూపి ఆటో కార్మికులకు ఆ స్థలంలో ఆటో పార్కు చేసేలా అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సానుకూలంగా స్పందించారు. సీఐటీయూ ఆరాంఘర్ ఆటో యూనియన్ నాయకులు ఇమ్రాన్, శ్రీను, లతీఫ్, రజాక్, బాషా, నారాయణ, మూర్తి, నాయక్, ఈశ్వర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బయోసైన్స్ టాలెంట్ టెస్ట్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



రాయదుర్గం: బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 27న జరిగే జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించడం విశేషం. ఈ టెస్ట్‌లో మొదటి స్థానంలో తాజీన్, రెండవ స్థానంలో సదరక్ నిలిచారు. వీరిని సోమవారం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే తాజ్‌బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.